# వరంగల్ వాయిస్
Evening Daily


సంపుటి : 04 | సంచిక : 42
పేజీలు : 08 | వెల: రూ.5/-
సోమవారం
అక్టోబర్ 28, 2024
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




**హోంగార్డ్ కుటుంబానికి..**
రూ.30 లక్షల ప్రమాద బీమా అందజేత

8లో..






# ముహూర్తం ఎప్పుడో ?

- కాళోజీ కళాక్షేత్రం పూర్తయ్యేందుకు పదేళ్లు
- మరి ప్రారంభానికి ఎన్ని రోజులో..
- 2014, సెప్టెంబర్ 9న శంకుస్థాపన
- నిధుల లేమితో పలుమార్లు పనులకు బ్రేక్
- ముఖ్యమంత్రి అపాయింట్ మెంట్ కోసం ఎదురుచూపులు

హైదరాబాద్‌లోని రవీంద్రభారతికి దీటుగా రాష్ట్రంలో రెండో అతిపెద్ద పట్టణమైన వరంగల్‌లో కాళోజీ కళాక్షేత్రాన్ని నిర్మించాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం హనుమకొండ లోని హయగ్రీవాచారి గ్రౌండ్‌లో 4.5 ఎకరాల విస్తీర్ణంలో 12,990 చదరపు మీటర్ల (1,39,823 చదరపు అడుగుల) వైశాల్యంలో దీనిని అత్యద్భుతంగా నిర్మించేందుకు ప్రణాళికను రూపొందించారు. అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా 2014, సెప్టెంబర్ 9న కాళోజీ కళాక్షేత్రం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించి కేవలం ఐదు నెలల్లోనే పూర్తి చేసి జనవరిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కేసీఆర్ గొప్పగా ప్రకటించారు. తర్వాత ఏమైందో ఏమో ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పనులకు బ్రేక్ పడింది. కొన్ని సంవత్సరాలపాటు చిల్లి గవ్వకూడా కేటాయించకపోవడంతో పనులు మూలకు పడ్డాయి. 2023లో శాసన సభ ఎన్నికలకు ముందు కొంత హడావిడి చేసినా పనులను మాత్రం పూర్తిచేయలేకపోయారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కళాక్షేత్రానికి అధిక మొత్తంలో నిధులు విడుదల చేయడంతో పనులు చివరి దశకు చేసుకొని ప్రారంభానికి ఎదురుచూస్తోంది. అయితే ముఖ్యమంత్రి అపాయింట్ మెంట్ దొరక్కపోవడంతో ప్రారంభోత్సవానికి ఆలస్యం అవుతున్నట్లు చెప్పకొస్తున్నారు. - వరంగల్ వాయిస్, హనుమకొండ

వివరాలు 2లో..




## అప్పం చందనకు ఘన సత్కారం

- దేశ వ్యాప్తంగా 30మంది కళాకారుల ఎంపిక
- ఎఫ్ఎంవీఆర్ చెన్నై సహకారంతో జ్ఞాపికల అందజేత

5లో..



## ప్రముఖులకు ఘన సన్మానం

వివిధ రంగాల్లో విశిష్ఠ ప్రతిభను కనబర్చిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టు గడ్డం కేశవమూర్తి, షటిల్ కోచ్ కూరపాటి రమేశ్ లను సోమవారం ఉదయం జేఎన్ఐఎస్ షటిల్ క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. –వనంగల్ వాయిస్, హనుమకొండ



## మొక్కలను సంరక్షించాలి

కలెక్టర్ ప్రావీణ్య

8లో..




## వారు సమాజానికి అమూల్యమైన సంపద

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా

# ముహూర్తం ఎప్పుడో..?



- కాళోజీ కళాక్షేత్రం పూర్తయ్యేందుకు పదేళ్లు
- మరి ప్రారంభానికి ఎన్ని రోజులో..
- 2014, సెప్టెంబర్ 9న శంకుస్థాపన
- నిధుల లేమితో పలుమార్లు పనులకు బ్రేక్
- ముఖ్యమంత్రి అపాయింట్ మెంట్ కోసం ఎదురుచూపులు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పుట్టుక, చావు కాకుండా బతుకంతా తెలంగాణ కిచ్చిన మహనీయుడు కాళోజీ నారాయణ రావు. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకు వ్యతిరేకంగా అతడు తన కలం ఎత్తాడు. కాళోజీ స్వాతంత్ర సమరయోధుడే కాదు తెలంగాణ ఉద్యమ కారుడు. అతని జన్మదినాన్ని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా గుర్తించి గౌరవించింది. తెలంగాణ తొలిపొద్దు కాళోజీ గుర్తుగా హనుమకొండ పట్టణంలో కళోజీ కళాక్షేత్రం నిర్మించాలని అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే 2014, సెప్టెంబర్ 9న అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన కాళోజీ కళాక్షేత్రం ప్రాజెక్టు నిర్మాణం పదేళ్లపాటు ఆగుతూ..సాగింది. రూ.55 కోట్లతో కళాక్షేత్రాన్ని కేవలం ఐదు నెలల్లోనే పూర్తి చేయాలని నిర్ణయించినా నిధుల లేమితో పలుమార్లు పనులకు బ్రేక్ పడింది. ఒక దశలో ప్రాజెక్ట్ మధ్యలోనే ఆగిపోతుందా అన్నట్లుగా పూర్తిగా నిలిపివేశారు. దీంతో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి గడువులోపు పూర్తి చేస్తామంటూ ప్రకటించిన కేసీఆర్ మాటలు నీటిమూటలుగానే మిగిలిపోయాయి.

### నాలుగు అంతస్తుల్లో నిర్మాణం..

హైదరాబాద్‌లోని రవీంద్రభారతికి దీటుగా కాళోజీ కళాక్షేత్రాన్ని నిర్మించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి దేశ, విదేశాల్లో నిర్మించిన పలు భవనాల నమూనాలను సేకరించి వాటిలో అత్యుత్తమమైన దానిని ఎంపిక చేశారు. నాలుగు అంతస్తులుగా జీ ప్లస్ 4 గా నిర్మిస్తున్న ఈ కళాక్షేత్రం మొదటి దశలో భవనం సూపర్ స్ట్రక్చర్ నిర్మాణం, రెండో దశలో ఇంటీరియర్, మెకానికల్, ఎలక్ట్రికల్ పనులు, మూడో దశలో ల్యాండ్ స్కేపింగ్, పాథ్ వే, పార్కింగ్ ఇతరత్రా పనులు చేపట్టనున్నట్లు ప్రకటించారు. అదే విధంగా కళాక్షేత్రానికి ముందు కాళోజీ నారాయణ రావు నిలువెత్తు విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించి అందుకు తగ్గట్లుగానే విగ్రహ ఏర్పాటు చేశారు తప్ప దానికి ఉన్న ముసుగు మాత్రం ఇప్పటికీ వీడలేదు.





### కల్పించే సౌకర్యాలు..

కళాక్షేత్రం గ్రౌండ్ ఫ్లోర్ లో ఆర్ట్ గ్యాలరీ, ఆడిటోరియం, రిహార్సల్స్ రూం. గ్రీన్ రూం, లాబీని ఏర్పాటు చేసేలా నిర్మాణ పనులను ప్రారంభించారు. మొదటి అంతస్తులో ఆర్టియం, ఫంక్షన్ ఏరియా, ఆఫీసు గదులు, ఫుడ్ కౌంటర్, స్టోర్ రూమ్స్, వాష్ రూమ్స్, రెండో అంతస్తులో గ్రంథాలయం, ఆఫీసు, స్టోర్స్, లాబీ, వాష్ రూమ్స్ నిర్మించాలని నిర్ణయించారు. మూడు, నాలుగో అంతస్తుల్లో ప్రీ ఫంక్షన్ లాబీ, బాల్కనీ, టెర్రస్, క్యాట్ వాక్ లాబీ ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు వెయ్యి మంది కూర్చునే సామర్థ్యంతో మూడు ఎకరాల స్థలంలో అత్యాధునిక ఆడిటోరియంతో కూడిన కన్వెన్షన్ సెంటర్ నిర్మించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేలా ఏర్పాటు చేసిన ఈ ఆడిటోరియంను అద్దెకు తీసుకునే సదుపాయాన్ని కల్పించాలని నిర్ణయించారు.

### సీఎం కోసం ఎదురు చూపులు..

బీఆర్ఎస్ పాలనలో ఆగుతూ..సాగిన కాళోజీ కళాక్షేత్రం పనులు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక స్పీడందుకున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య నిత్యం క్షేత్రాన్ని సందర్శించడంతోపాటు పనులు త్వరగా పూర్తి చేసేలా దిశానిర్దేశం చేశారు. దీంతో పనులన్నీ కొలిక్కి వచ్చాయి. అయితే సెప్టెంబర్ 9న కాళోజీ జయంత్రి సందర్భంగా దీనిని ప్రాచంభించాలని నిర్ణయించినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపాయింట్ మెంట్ దొరక్క పోవడంతో వాయిదా పడింది. అప్పటినుంచి కళాక్షేత్రం పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని ఎదురు చూస్తున్నా రోజు రోజుకు వెనక్కి పోతోంది. అయితే పనులు పూర్తి అయినప్పటికీ ప్రారంభించక పోవడంపై కళాకారులు, పట్టణ జనం మండి పడుతున్నారు. వెంటనే కళాక్షేత్రాన్ని ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఆ జవాన్లను తొలగించండి



- శానిటరీ ఇన్ స్పెక్టర్ లపైనా చర్యలు
- పశ్చిమ అభివృద్ధిపై సమీక్ష
- పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని, మేయర్, కలెక్టర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమంపై సోమవారం కుడా కార్యాలయంలోని సమావేశ మందిరంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ పి.ప్రవీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తనాజీ వాకాడే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని డివిజన్ ల వారిగా జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. అభివృద్ధి పనులు చాలా వరకు పూర్తి కావచ్చాయని అధికారులు తెలియజేశారు. టెండర్ లు వేసి ఇంకా పనులను ప్రారంభించని కంట్రాక్టరలకు నోటీసులు అందించి మళ్ళీ పనులు చేయకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పనులపై జరుగుతున్న జాప్యం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే భద్రకాళీ బండు పనులు దాదాపు పూర్తి కావచ్చాయని తెలిపారు. బొంది వాగు పనులు కూడా జరుగుతున్నాయని వివరించారు. పబ్లిక్ గార్డెన్స్ ఆవరణలో నిర్మించిన శంఖు చుట్టూ వాహనాలు నిలపడంతో చూపరులకు ఇబ్బందిగా ఉంటుందని తక్షణమే సదరు వాహనాల యజమానులకు నోటీసులు ఇవ్వాలని లేని పక్షంలో ట్రాఫిక్ పోలీస్ లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహా నగరంలో ఉన్న మునిసిపల్ జవాన్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ లు స్థానికంగా ఉంటూ చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వెంటనే పనిచేయని సానిటరీ ఇన్ స్పెక్టర్ లను కానీ, జవాన్ లను కానీ పనుల నుంచి తొలగించాలని ఆదేశించారు.



వార్డుల్లో పర్యటిస్తున్న క్రమంలో చాలా చోట్ల డ్రైన్ లు నిండి కనపడటం పట్ల సమావేశంలో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కాజీపేట మార్కెట్, బాలసముద్రం ఎల్ఐసీ పరిసరాలు, పలు ప్రధాన కూడళ్లలో చిరు వ్యాపారులకు కేటాయించిన స్థలాల్లో కాకుండా రోడ్డు మీదకు వచ్చి వ్యాపారలు చేయడంతో ట్రాఫిక్, ప్రజా రవాణాకు చాలా ఇబ్బందులు వస్తున్నాయన్నారు. సంబంధిత శాఖల అధికారులు పోలీస్ వారి సహాయంతో కేటాయించిన స్థలంలోనే వ్యాపారాలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్ట్రీట్ వెండర్ లను ఉపయోగించుకోకపోవడం చాలా దురదృష్టకరం అన్నారు. అందరికీ 15రోజుల నిర్ణత సమయం ఇచ్చి సమస్య పరిష్కరించాలన్నారు. కాజిపేట్, సోమిడి, గోపాలపురం ప్రాంతాలలో చిన్నపాటి నీటి అసౌకర్యం ఉందని వెంటనే పరిష్కరించాలని, రానున్న వేసవి కాలం నాటికి నగరంలో ఎక్కడ కూడ నీటి ఏద్దడి లేకుండా చూడలన్నారు. లేకేజీలు లేకుండా చూడాలని చిన్న చిన్న పనులను వేంటనే పరిష్కరించాలని కోరారు. ఉధృతంగా వ్యాప్తి చెందుతున్న కోతుల బెడద వలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కోతుల సంతతికి నివారణ చర్యలు చేపడుతూనే పట్టుకున్న లోతులను పరిసర ప్రాంతాల్లో కాకుండా సూదూరా అడవి ప్రాంతాల్లో వదిలేలా చూడాలని తెలిపారు. కుక్కలా బెడదా వలన కూడా చాలా వరకు సమస్యలు తలెత్తున్నాయన్నారు. కుక్కలకు ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ టీకాలు ఇవ్వాలని పట్టిన వాటిని పక్క కాలనీల్లో వదిలివేయడం వలన ఇబ్బందులు పెరుగుతున్నాయన్నారు. రెడ్ క్రాస్ వారితో సంప్రదించి వాటి నివారణపై మరింత అధ్యయనం చేయాలని తెలిపారు. నగరంలో ఇప్పటికే ఉన్న, నూతనంగా నిర్మాణాలు చేపడుతున్న షాపింగ్ కాంప్లెక్స్ లు, హాస్పిటల్ లలో మూత్ర విసర్జన శాలలు, పార్కింగ్ తప్పనిరిగా ఉండేలా అధికారులు ఆదేశాలు జారిచేయాలన్నారు. పార్కింగ్ ఇవ్వకుండా సెల్లార్ లలో వారి వ్యాపారలు కొనసాగిస్తూ పార్కింగ్ రోడ్డుపై వదిలేస్తున్నారని ఎమ్మెల్యే నాయిని ఆందోళన వ్యక్తం చేశారు. కాళోజి కళక్షేత్ర నామకరణ బోర్డులలో తెలుగు, ఇంగ్లీష్ లలో ఉన్నప్పటికీ ఉర్దూ బోర్డు కూడా ఉండాలని తెలియజేశారు. శరవేంగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో నగరంలోని పలు జంక్షన్ లలో ట్రాఫిక్ సిస్టం ఏర్పాటు చేయాలాని గోకుల్ జంక్షన్, పెగడపల్లి, డబ్బాల ప్రాంతాలలో వెడల్పు కార్యక్రమం మున్సిపల్ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు సంయుక్తంగా చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పోలీస్, ట్రాఫిక్, ఇరిగేషన్, రోడ్లు భవనాలు, విద్యుత్ శాఖ, స్మార్ట్ సిటీ, మున్సిపల్ శాఖ, కుడా అధికారులు, దేవదాయ శాఖ తదితరులు పాల్గొన్నారు.

## జనార్ధన్ మరణం పద్మశాలి సమాజానికి తీరని లోటు



వరంగల్ వాయిస్, రఘునాథపల్లి : చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర నేత మంగళపల్లి జనార్దన్ మరణం పద్మశాలి సమాజానికి తీరని లోటని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని పద్మశాలి సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వేముల బాలరాజు నేత అన్నారు. సోమవారం అనారోగ్యంతో మృతి చెందిన జనగామ పట్టణానికి చెందిన మంగళపల్లి జనార్దన్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలి సమాజ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన జనార్దన్ సేవలు మరువలేని అన్నారు. తెలంగాణ ప్రాంతంలో పద్మశాలీల సాధన కోసం నిరంతరం పోరాడిన ఏకైక వ్యక్తి జనార్దన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా పద్మశాలి సంఘం ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి నేత, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జి గజ్జల దామోదర్ నేత, చిల్పూర్ మండల కార్యదర్శి బందారి రాజ్ కుమార్ నేత, రాష్ట్ర నాయకులు శ్యామల పరమేశ్వర్ నేత తదితరులు పాల్గొన్నారు.

## రేపు బుగులోని జాతర వేలం పాటలు



వరంగల్ వాయిస్, రేగొండ : మండలంలోని తిరుమలగిరి శివారు గుట్టల్లో జరిగే బుగులోని వెంకటేశ్వర స్వామి జాతర వేలం పాటలు రేపు మంగళవారం రోజు నిర్వహించనున్నట్లు బుగులోని జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ రొంటాల వెంకటస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతరలో కొబ్బరికాయలు అమ్ముకొనుటకు, లడ్డు పులిహోర, పుట్నాలు, పేలాలు అమ్ముకొనుటకు వేలం పాటలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తిరుమలగిరి గ్రామపంచాయతీ ఆవరణంలో ఉదయం 10 గంటలకు ఈ వేలంపాటలు నిర్వహిస్తామని అన్నారు. కొబ్బరికాయలు అమ్ముకొనుటకు 50,000 రూపాయలు, లడ్డు, ప్రసాదం అమ్ముకొనుటకు 50,000, పుట్నాలు, పేలాలు అమ్ముకొనుటకు 3000 రూపాయలు ధరావత్తు సొమ్ము చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని చైర్మన్ వెంకటస్వామి తెలిపారు.

## ఉద్యమకారులకు ఇంటి స్థలం ఇవ్వాలి



వరంగల్ వాయిస్, మొగిలిచెర్ల : తెలంగాణ ఉద్యమకారులను కేసీఆర్ వాడుకొని వదిలేశారని, తెలంగాణ ప్రజలకు ఒకరికి రేషన్ కార్డు, నిరుపేదలకు పక్కా ఇల్లు కట్టించక భోగ విలాసాలకు కేసీఆర్ కుటుంబ పార్టీ బానిస కావడంతో ఘోరంగా పతనమైందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం గీసుగొండ మండల అధ్యక్షుడు ఆడెపు రమేష్ అన్నారు. కమీషన్లకు కక్కుర్తి పడ్డ కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ ప్రజానీకం పాతాళానికి తొక్కారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలాన్ని పక్కా ఇల్లు కట్టిస్తారని హామీ ఇచ్చారు. ఆ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి మరచిపోయారని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం పోరాటానికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సిద్ధమైందని ఆడెపు రమేష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన సదస్సు



వరంగల్ వాయిస్, కాశిబుగ్గ : నగరంలో మేరా యువ భారత్ సంస్థ ద్వారా ఏవీవీ కాలేజీకి చెందిన 20 మంది యూత్ సభ్యులు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు రాగా వారికి వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ ట్రాఫిక్ నియమాలపై, ట్రాఫిక్ సిబ్బంది విధుల గురించి అవగాహన కల్పించారు. వారిని వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జంక్షన్లలో, జంక్షన్‌కి ఇద్దరు చొప్పున ట్రాఫిక్ సిబ్బందితో కలిపి ప్లకార్డ్స్ పట్టుకొని వాహనదారులకు ట్రాఫిక్ నియమాల మీద అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మై భారత్ డిస్ట్రిక్ యూత్ ఆఫీసర్ చింతల అన్వేష్, ఏవీవీ కాలేజ్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# యూరో గైనకాలజీ సమస్యలపై యూపీఐఏ సదస్సు




వరంగల్ వాయిస్, హనుమకొండ : జిల్లాలోని గ్రావిడ్ హోం హాస్పిటల్స్ లో యూరో గైనకాలజీ పెల్విక్ ఫ్లోర్ డిస్‌ఫంక్షన్, ఇన్‌కంటినెన్స్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ హనుమకొండ సుబేదారి సంయుక్త ఆధ్వర్యంలో యూరో గైనకాలజీ సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఉమ్మడి వరంగల్ జిల్లాలో యూరో గైనకాలజీ పెల్విక్ ఫ్లోర్ డిస్ ఫంక్షన్ ఇన్‌కంటినెన్స్ అసోసియేషన్ విస్తరిస్తున్న క్రమంలో లోగోను ఆవిష్కరించారు. పెల్విక్ హెల్త్ అవేర్‌నెస్ కోసం హైదరాబాద్ కేంద్రంగా కొనసాగుతున్న యూపీఐఏ హైదరాబాద్ సొసైటీని వరంగల్‌కు విస్తరించిన క్రమంలో భాగంగా ఈ అవగాహనా సదస్సు డా. రమ్య వందన శెట్టి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా యూపీఐఏ ట్రెజరర్ డా.బిందు ప్రియ, సీనియర్ యూరో గైనకాలజిస్ట్, కిమ్స్ హైదరాబాద్, యూపీఐఏ జాయింట్ సెక్రెటరీ డా.నిర్మలా పాపల్కర్, సీనియర్ యూరో గైనకాలజిస్ట్, కిమ్స్ హైదరాబాద్, గ్రావిడ్ హోమ్ హాస్పిటల్స్ హనుమకొండ కన్సల్టెంట్ యూరో గైనకాలజిస్ట్ డా.రమ్య వందన శెట్టి, గైనకాలజిస్టులు డా.స్ఫూర్తి రావు నడిపల్లి, డా.దీపా.జి తదితర వైద్య బృందం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ యూరో గైనకాలజిస్ట్ డా.బిందు ప్రియ మాట్లాడుతూ మహిళలకు గైనిక్ సమస్యల పట్ల అవగాహన అవసరమన్నారు. యూరో గైనకాలజీకి సంబంధించిన అనేక సమస్యలను, యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్స్, మహిళలలో గర్భాశయ క్యాన్సర్ తదితర అనేక అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. యూపీఐఏ సేవలు వరంగల్ జిల్లాలో మరింత విస్తరిస్తామని పెల్విక్ హెల్త్ మీద అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి మహిళల గర్భాశయ ఆరోగ్య రక్షణ కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సుబేదారి హనుమకొండ ప్రెసిడెంట్, సీనియర్ జర్నలిస్ట్ డా. వీణా శ్రీనివాస్ మాట్లాడుతూ అందరి ఆరోగ్యం గురించి ఆలోచించే మహిళలు ముఖ్యంగా గైనిక్ సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారని, గైనిక్ సమస్యల పట్ల అవగాహన అవసరమని పేర్కొన్నారు. సమస్య ఆదిలోనే వైద్యులను సంప్రదిస్తే మందులతోనే సమస్య పరిష్కారం అవుతుందని, సమస్య తీవ్రమైన తర్వాత వైద్యుల వద్దకు వెళ్తే ప్రయోజనం ఉండదన్నారు. ప్రతీ ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు యూపీఐఏ ను ఏర్పాటు చేసి వైద్యులు ముందుకు వచ్చినందుకు గ్రావిడ్ హోమ్ హాస్పిటల్స్ హనుమకొండ వైద్య బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన మహిళలు వైద్యులు చెప్పిన అనేక విషయాలను శ్రద్ధగా విని అవగాహన పెంచుకున్నారు. ఈ కార్యక్రమానికి గ్రావిడ్ హోం హాస్పిటల్స్ సీఈఓ డా.జే.ప్రదీప్ ఎంతగానో సహకరించారని డా.రమ్య వందన శెట్టి కృతజ్ఞతలు తెలిపారు.

## అలకనందకు అరుదైన గౌరవం



వరంగల్ వాయిస్, భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆన్ సాన్ పల్లి గ్రామానికి చెందిన ప్రముఖ వర్ధమాన నృత్య కళాకారిణి బానోత్ అలకనంద రాథోడ్ గత రెండు సంవత్సరాల నుంచి జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి సాంస్కృతిక కళా వేదికలపై ఎన్నో రకాలుగా తన నృత్య ప్రదర్శనతో అందరిని అలరించింది. అలాగే, ఎంతో మంది ప్రముఖుల చేతుల మీదుగా పలు అవార్డులు అందుకుంటూ ప్రశంసలు అందుకుంటున్నారు. గత రెండు సంవత్సరాలుగా భరత నాట్యంలో రాణిస్తున్న కుమారి అలకనంద రాథోడ్ భరత నాట్య నృత్య ప్రదర్శనలను యునైటెడ్ నేషన్, ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ వారు వాటిని ఆధారంగా తీసుకుని అంతర్జాతీయ భరత నాట్యం అవార్డుకు ఎంపిక చేశారు.



23 నవంబర్ 2024 తమిళనాడు రాష్ట్రం ఊటీలో జరిగే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా అలకనంద అవార్డుని అందుకోనున్నారు. కూతురు అంతర్జాతీయ అవార్డుకు ఎంపిక అవడం పట్ల తల్లిదండ్రులు, బంధువులు,స్నేహితులు, గ్రామస్తులు ఎంతో సంతోషంగా ఉన్నారు. అలాగే, భూపాలపల్లి బాలాజీ స్కూల్స్ యాజమాన్యం సంతోషం వ్యక్తం చేస్తూ అలకనందను అభినందించారు.

## ముగిసిన ప్రపంచ వారసత్వ వలంటీర్ల శిక్షణ



వరంగల్ వాయిస్, ములుగు : కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్, టూరిజం డిపార్ట్‌మెంట్ సహకారంతో ములుగు జిల్లా పరిపాలన శాఖ ఆధర్వంలో యునెస్కో మార్గదర్శకాల ప్రకారం ప్రపంచ వారసత్వ వలంటీర్లకు 12 రోజుల పాటు రామప్ప దేవాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించబారు. రామప్పలోని ప్రపంచ వారసత్వ ప్రదేశం గురించి నిర్దిష్ట సూచనతో వారసత్వ పరిరక్షణ, పర్యాటక ప్రమోషన్‌పై అవగాహన కల్పించడానికి ఉద్దేశించిన ఈ కార్యక్రమంలో అనేక మంది పీహెచ్ డీ పరిశోధకులతో సహా భారతదేశం నలుమూలల నుంచి 80 మంది వలంటీర్లు పాల్గొన్నారు. రామప్ప టెంపే, సరస్సు, పాండవుల గుట్ట, లక్నవరం తదితర ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, క్షేత్ర సందర్శనలు కూడా ఏర్పాటు చేశారు. రామప్ప దేవాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో బీపీ ఆచార్య మాజీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ, టీఎస్ దివాకర్ కలెక్టర్ సమన్వయకర్తల కృషిని కొనియాడుతూ పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు.



# గుగ్గిళ్ల పీరయ్య మాదిగకు జాతీయ పురస్కారం



వరంగల్ వాయిస్, మహబూబాబాద్ : హైదారాబాద్ లో త్యాగరాయ గానసభ ఆడిటోరియంలో హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ 149వ జయంతి సందర్భంగా జాతీయ పురస్కారం ఎంఎస్పీ జాతీయ నాయకుడు గుగ్గిళ్ల పీరయ్య మాదిగకు అందించారు. అనంతరం గుగ్గిళ్ల పీరయ్య మాదిగ మాట్లాడుతూ గడిచిన 30 సంవత్సరాల నుంచి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేసినందున నాకు హోప్ సేవా సంస్థ వారు సర్దార్ వల్లభాయ్ పటేల్ అవార్డును అందించినందుకు దైద వెంకన్న, వారి సతీమణిలకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. తను కరోనా సమయంలో మున్సిపాలిటీ కార్మికులకు, పోలీసులకు, కరోనా వచ్చిన పేషెంట్లకు దగ్గర ఉండి వైద్య సేవలను అందించడమే కాకుండా, మున్సిపాలిటీ కార్మికులకు కోడిగుడ్లు, అరటి పండ్లు, పాలు అందజేయడం జరిగిందన్నారు. అదేవిధంగా మొన్నటికి మొన్న వరద బాధితులకు రైల్వే స్టేషన్లో సుమారుగా 200 మంది ప్రయాణికులకు మంచి భోజనాన్ని అందించానని తెలిపారు. అదేవిధంగా అనేకమంది నిరుపేదలు ఇంటి స్థలం లేని వారి కోసం సుమారుగా 500 కుటుంబాలకు మహబూబాబాద్ పట్టణంలో ప్రభుత్వ భూమిని మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎంఆర్పీఎస్ జెండాతో పేదలకు ఇంటి స్థలాలు పంచడం జరిగింది. ఇప్పుడు ఆ పేదలు ఇంటి నెంబరు, పట్టాలు వచ్చి సంతోషంగా రోజువారి కూలి చేసుకొని జీవనం గడుపుతున్నారని తెలిపారు. తన సేవలను గుర్తించి హోప్ స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపకుడు, మిత్రుడు దైద వెంకన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ అవార్డును అందించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను, ఫిర్యాదులను యంత్రాంగం దృష్టికి తీసుకురావడం జరిగిందని వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల తహసీల్దార్, ఎంపీడీఓలతో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 40 దరఖాస్తులను అదనపు కలెక్టర్లు రెవెన్యూ సీహెచ్ మహేందర్ జి, సంపత్ రావులతో కలిసి స్వీకరించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎండార్స్ మెంట్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఫిర్యాదులను ప్రాధాన్యతగా తీసుకొని పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రతీ ఫిర్యాదును సమీక్షించడానికి ప్రత్యేకంగా ప్రతి కార్యాలయంలో అధికారికి బాధ్యత అప్పగించాలని సూచించారు. ప్రతి సోమవారం ఫిర్యాదుల దరఖాస్తులు పరిష్కారంపై పర్యవేక్షిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉండాలని, ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలను మరింత సమర్థంగా అందజేసే లక్ష్యంతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదులు వివిధ విభాగాలకు పంపించడం జరిగిందని, వాటిని పరిష్కరించడానికి నిర్దిష్ట గడువులోగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డీఓ కె.సత్యపాల్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

# కాలనీలను అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తా

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట :** సమస్యల పరిష్కారంలో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి సోమవారం 31వ డివిజన్ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. కాలనీలో పర్యటిస్తూ నేరుగా అంతర్గత రోడ్లను, సైడ్ డ్రైన్ లను పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో జులైవాడు ప్రాంతాల నుంచి వర్షపు నీరు నేరుగా నంది హిల్స్ కాలనీ మీదుగా వెళుతున్న క్రమంలో చాలా ఇల్లు వరకు వరద ఉధృతిలో ఉంటున్న విషయాన్ని స్థానికుల ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అభివృద్ధి పనులు ఒక్కొక్కటిగా చేస్తూ వస్తున్నామని, ఐదేళ్లలో ప్రతి కాలనీని అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులు కాలనీలో పర్యటించి నివేదికలు అందించాలని ఫోన్ ద్వారా ఆదేశించారు. స్థానికంగా ఉన్న పంచముఖ ఆంజనేయ ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్లు మాధవి, మోహన్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని లక్ష్మా రెడ్డి, కాలనీ అధ్యక్షులు, పెద్దలు తదితరులు ఉన్నారు.

# కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటా



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** ఆపదలో ఉండే ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని స్టేషన్ ఘనపూర్ ఇంచార్జి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిరా అన్నారు. సోమవారం వారి ఆదేశాల మేరకు ఘనపూర్ పార్టీ శ్రేణులు ఇటీవల మరణించిన తాటికొండ గ్రామానికి చెందిన మారపాక విజయ్ కుటుంబానికి పరామర్శించి నివాళులర్పించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీసెల్ జిల్లా కన్వీనర్ సంపత్ యాదవ్, జిల్లా మహిళా కార్యదర్శి మౌనిక, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సింగపురం దయాకర్, స్టేషన్ ఘనపూర్ మండల ప్రధాన కార్యదర్శి సింగపురం నాగయ్య, ఘనపూర్ మండల మహిళా అధ్యక్షురాలు జ్యోత్స్న, మండల ప్రధాన కార్యదర్శి పద్మ, ఘనపూర్ దేవాలయ కమిటీ చైర్మన్ నరసింహ, మడపాక శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకులు దామెర శ్రీను, బొల్లం నాగరాజు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేని కృషి రిసార్ట్స్ పై చర్యలు తీసుకోవాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా పరిధిలోని ఐనవోలు మండల కేంద్రాల్లో అనుమతి లేకుండా నడుస్తున్న కృషి రిసార్ట్స్ పై విచారణ జరిగితే చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్ ఫౌండేషన్ చైర్మన్ టీపీసీసీ గీత సెల్ సెక్రెటరీ రావుల వెంకట రమేష్ గౌడ్ సోమవారం హనుమకొండ జిల్లా ప్రజా వాణిలో కలెక్టర్ ను కోరారు. ఉడుత గూడెం గ్రామ పంచాయతీ పరిధిలో పోలేపల్లి రాజిరెడ్డి కృషి రిసార్ట్స్ ను ఎటువంటి అనుమతి లేకుండా ట్రేడ్ లైసెన్స్ లేకుండా ఇంటి నెంబర్ కు తీసుకోకుండా నడిపిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. ఉడుత గూడెం గ్రామపంచాయతీ కట్టాల్సిన టాక్సీలను కట్టకుండా గ్రామపంచాయతీకి రావలసిన ఆదాయాన్ని గండి కొడుతున్నాడని అన్నారు. కృషి రిసార్ట్స్ అనుమతులపై విచారణ జరిపి, దీనికి సహకరిస్తున్న అధికార పార్టీ పెద్దలు ఎవరు ఉన్నా వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వెంకట రమేష్ గౌడ్ జిల్లా కలెక్టర్ ను కోరారు.

# తాళం వేసిన ఇంటికి కన్నం

## బంగారు, వెండి, నగదు మాయం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఇంటికి తాళాలు వేసి తమ బట్టల షాప్ వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చే లోపే దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి కప్ బోర్డ్ లో దాచిన రెండు తులాల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలు, రూ.35 వేల నగదును చోరీ చేసిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీలో చోటుచేసుకుంది. కాలానికి చెందిన కేలోతు కిషన్ తన దుస్తుల వ్యాపారం చేసుకొనేందుకు తన భార్యతో కలిసి ఇంటికి తాళాలు వేసి షాప్ వద్ద వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సరికి దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు వెండి అభరణాలు నగదు చోరీ చేశారన్నారు. చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని, పైసా, పైసా కూడేసి దాచుకున్న నగదు, బంగారు, వెండి ఆభరణాలు దొంగలు దోచుకొని ఇల్లును గుల్ల చేశారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షుణ్ణంగా పరిశీలించి, క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు.

# ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలను విడుదల చేయాలంటూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. పట్టణంలోని మదర్ థెరిసా సెంటర్ లో ప్రారంభమైన ర్యాలీ ప్రభుత్వ ఆసుపత్రి, నెహ్రూ, తహశీల్దార్, మూడు కొట్ల సెంటర్ల మీదుగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలతో ఎమ్మెల్యే కార్యాలయ ప్రాంతం మారు మ్రోగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రకాష్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న 8 వేల 2 వందల కోట్ల రూపాయల ఉపకార వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యారంగ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయడంలో ప్రభుత్వం విఫమమైందని విమర్శించారు. విద్యార్థులు నెల రోజుల నుంచి ఆందోళనలతో కథం తొక్కుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టైనా లేదని ధ్వజమెత్తారు. బకాయిలను వెంటనే విడుదల చేయకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని, నవంబర్ 9న రాష్ట్ర ప్రభుత్వానికి సంవత్సరిక కార్యక్రమం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ఆందోళనలో విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

# జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బానోత్ రవిచందర్ బాధ్యతల స్వీకరణ



**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమించబడిన బానోత్ రవిచందర్ ఆదివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దనసరి సూర్య హాజరై రవిచందర్ కు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మైనారిటీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, శ్రేయోభిలాషులు, గ్రంథాలయ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే చర్యలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడ్డ నలుగురు వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ.5000 జరిమాన విధించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో 24 మందికి రూ. 36,000 జరిమాన విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె. రామకృష్ణ తెలిపారు.

# ఎంబాడీ రవీందర్ దశదిన కర్మ

## హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహానగర మాజీ డిప్యూటీ మేయర్, ప్రముఖ రాజకీయ నాయకుడు ఎంబాడీ రవీందర్ దశదిన కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పాల్గొని వారి చిత్రపటానికి పూలతో నివాళులర్పించి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 33వ డివిజన్ బీజేపీ అధ్యక్షులు ముద్దసాని కృష్ణ, 34వ డివిజన్ బీజేపీ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, కందుకూరి విజయ్, కాళీ రాజు, బోడకుంట్ల శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## క్లాబ్యాక్‌ను తొలగించాలని ఏజెంట్ల నిరసన



**వరంగల్ వాయిస్, ములుగు రోడ్డు :** ఐఆర్డీఏఐ విధానాలకు వ్యతిరేకంగా ఎల్ఐసీ ఏజెంట్స్ సోమవారం లంచ్ అవర్ గేట్ ధర్నా నిర్వహించారు. ధర్నాకు డివిజన్ అధ్యక్షుడు వైవీ కృష్ణారావు, పులి సుధాకర్ లు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి అధ్యక్షుడు పబ్బ రాజా శ్రీనివాసరావు మాట్లాడుతూ పెంచిన ప్రీమియం రేట్లు తగ్గించాలని, తగ్గించి న కమీషన్ పెంచాలని, క్లాబ్యాక్ విధానాన్నితొలగించాలని, పెంచిన సమ్ అష్యూర్డ్ తగ్గించాలని, పాలసీ చేసే వయస్సు 50 ఏళ్లకు తగ్గించాలని, సీకేవైసీ విధానాన్ని ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అశోక్, క్యాషియర్ శ్రీనివాస్, ముఖ్య నాయకులు రాజి రెడ్డి, రవీంద్ర రావు, శ్రీనివాసాచారి, సతీష్, సత్యనారాయణ, తిరుపతి, కుమారస్వామి, వెంకటేశ్వర్లు, భిక్షపతి, వీరస్వామి, తిరుపతి రెడ్డి, రవి బాబు, శ్రీకాంత్, రాజు, హరినాథ్, శ్రీనివాస్, ప్రభాకర్, శంకర్, మహిళా నాయకురాలు ప్రతిమ, సునీత, శ్రావణి, రజనీ, సరిత తదితరులు సుమారు వంద మంది ఏజెంట్స్ పాల్గొన్నారు.

## ఎల్ఐసీ ఏజెంట్ల ఆందోళన



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జీవిత భీమా పాలసీలపై జీఎస్టీ ఎత్తివేసి, బోనస్ పెంచాలంటూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయం ఎదుట సంస్థ ఏజెంట్లు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ ఏజెంట్లకు ఇచ్చే కమిషన్ తగ్గింపును విరమించుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల వారికి అనుకూలంగా ఉండే విధంగా కనీస బీమా మొత్తాన్ని లక్ష రూపాయల పాలసీని కొనసాగించాలన్నారు. జీవిత బీమా పాలసీలపై జీఎస్టీ ఎత్తివేసి, బోనస్ రేటు పెంచి, పాలసీదారులకు లోన్ ల పై వడ్డీ రేటు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంట్లు పాల్గొన్నారు.

## నృత్య కళాకారిణి అప్పం చందనకు అవార్డు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎఫ్ఎం వీఆర్ చెన్నై వారి సహకారంతో దేశం నలుమూలల నుంచ భారత సంస్కృతి కళలను నలుమూలల తమ ప్రతిభతో చాటుతున్న దేశంలో ఉన్న 30 మంది కళాకారులను ఎంచుకొని వారికి అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన తమిళనాడు రాష్ట్ర అటవీ శాఖ మంత్రి డాక్టర్ మతివంతం చేతుల మీదుగా తెలంగాణ ఓరుగల్లు నృత్య కళాకారిణి అప్పం చందన అవార్డు స్వీకరించడంతో పాటు ఘనంగా సత్కరించబడ్డారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆమెను అభినందించారు.



## చిలకమ్మ కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రానికి పద్మశాలి కులస్తురాలైనా అంచే చిలకమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు స్వర్గం రవి ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం పరిచిన స్వర్గం రవి రూ.5 వేల నగదును పద్మశాలి కులస్తుల తరపున కుటుంబ సభ్యులకు అందజేశారు. నిరుపేద కుటుంబాలకు పద్మశాలి కుల సంఘం తరపున అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మెండు రాధిక రమేష్, పద్మశాలి పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి పులికంటి రాజేందర్, ఉపాధ్యక్షుడు దాసి శంకరయ్య, సభ్యుడు పులికంటి ప్రభాకర్, పేరాల నరసింహస్వామి, చేరాల రమేష్, పేరాల రమణయ్య, చేరాల నరసయ్య, కోట పున్నం చందర్, అంచే సాంబయ్య, కోట రాజు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి పరకాల వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరకాల వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ఏ గ్రేడ్‌కు రూ.2320, కామన్ రకానికి రూ.2300 ధర చెల్లిస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం 17శాతం మాయిచర్ ఉండాలని అన్నారు. కేవలం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో మాత్రమే సన్నధాన్యానికి బోనస్ లభిస్తుందన్నారు. రైస్ మిల్లుల్లో విక్రయాలకు బోనస్ వర్తించదని, ప్రతి ఒక్క రైతుకు ఈ విషయంపై అవగాహన కల్పించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రవాణా, హమాలీలు, గోనె సంచుల కొరత రాకుండా చూడాలని అన్నారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని అన్నారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు కట్కూరు దేవేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కోయడ శ్రీనివాస్, పరకాల పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలి

### ఏఐపీకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు తెలంగాణ రైతాంగానికి ఇచ్చిన హామీలలో రైతు పండించిన వరి పంట క్వింటాకు రూ. 500 బోనస్ కలిపి ఇస్తానన్న హామీని తక్షణమే అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి అన్నారు. సోమవారం ఖిలా వరంగల్ తాహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాహసీల్దార్ డి.రమేష్ కు, హనుమకొండ డిప్యూటీ తహసీల్దార్ ఎం.రంజిత్ కుమార్ కు ప్రతినిధి బృందంగా వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా చిర్ర సూరి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు పండించిన పంటకు ప్రతి క్వింటాలకు రూ.500 బోనస్ ఇస్తానన్న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇంకా, 50 శాతం అమలు కాని రెండు లక్షల రైతు పంట రుణమాఫీని వెంటనే పూర్తి చేయాలని కోరారు. రైతు పండించిన పంటలను మధ్య దళారీల ద్వారా కాకుండా ప్రభుత్వ రంగ సంస్థ చే కొనుగోలు చేయాలని, దళారీల బారిన పడకుండా రైతాంగాన్ని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు భరోసా చిన్న, సన్నకారు రైతులకు ఇస్తూ వారిని ప్రోత్సహించే విధంగా కాకుండా నిరుత్సాహపరిచే విధంగా రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో రుణమాఫీ అమలు కాక, కొత్త రుణాలు అందక, ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తులు ఇష్టారాజ్యంగా అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ రైతులను అవస్థల పాలు చేస్తూ, ఆర్థికంగా దోచుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వం అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగంలో స్వామినాథన్ కమిషన్ సిఫారసులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం వరంగల్ డివిజన్ కార్యదర్శి అర్షం సుధాకర్, సహాయ కార్యదర్శి అంకూస్, మైదం పాణి, అర్షం అశోక్, సంగేపు రాజేంద్రప్రసాద్, బి.నరసింహారావు, వెంకన్న, సతీష్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం.. క్షేమంగా గమ్యానికి చేరుదాం




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** భారత ప్రభుత్వ యువజనుల, క్రీడా శాఖ ఆదేశానుసారం "దీవాలి విత్ భారత్" భారత్ తో నా దీపావళి అనే కార్యక్రమాన్ని ఎన్ వైకే వరంగల్, ఏవీవీ జూనియర్ కాలేజ్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొడిమాల శ్రీనివాసరావు సంయుక్త ఆధ్వర్యంలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మట్టేవాడ ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ విచ్చేసి వలంటీర్లకు ట్రాఫిక్ రూల్స్, విధివిధానాల గురించి హెల్మెట్, సీట్ బెల్టు, డ్రంకెన్ డ్రైవ్, ఇతర రూల్స్ పై అవగాహన కలిగించి విద్యార్థులను సిబ్బందితో కలిసి ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. దీని ముఖ్య ఉద్దేశం ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కలిగి తమ మిత్రులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగించి వరంగల్ లో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ వైకే వరంగల్ కోఆర్డినేటర్ అన్వేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు, ఎన్ వైకే సిబ్బంది దేవిలాల్, సురేష్, సీనియర్ వలంటీర్లు ఫయాజ్, శివరాజ్, దేవి శ్రీప్రసాద్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

## దోజర్‌తో ముళ్ల చెట్ల తొలగింపు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** గట్లకానిపర్తి గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శ్రమదానం నిర్వహించారు. గట్లకానిపర్తి గ్రామం నుంచి నర్సింహులపల్లికి వెళ్లేదారిలో పిన్న చెరువు (పింజెరువు) కట్ట మీద ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లను దోజర్ తో తొలగించారు. దోజర్ తో పనిచేయుటకు దాదాపు 2 గంటలకు పైగా సమయం పట్టింది. ఈ కార్యక్రమానికి కన్వీనర్, కో కన్వీనర్లు, కమిటీ సభ్యులు ఆర్థిక సహాయం అందించారు. ఈ శ్రమదానంలో గ్రామ అభివృద్ధి కమిటీ కన్వీనర్, కో కన్వీనర్లు, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. దోజర్ డ్రైవర్ నాగరాజు కూడా చాలా కష్టపడి పనిచేయడం జరిగింది. ఆర్టీసీ బస్సుకు, అన్ని రకాల వాహనాలకు, గ్రామ ప్రజలకు ఇబ్బందిగా ఉన్న ముళ్ల చెట్లను తొలగించి సౌకర్యవంతంగా చేసినందుకు గట్లకానిపర్తి "గ్రామ అభివృద్ధి కమిటీ"ని గ్రామ ప్రజలు అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికి గ్రామ అభివృద్ధి కమిటీ తరుపున హృదయ పూర్వక కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు.

# కళాక్షేత్రంలో కళాకారుల విగ్రహాలను ఏర్పాటు చేయాలి

## విద్యార్థి సంఘాల భారీ ర్యాలీ

## బాల సముద్రంలో ఉద్రిక్తత



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** హనుమకొండ జిల్లా బాలసముద్రంలో ప్రభుత్వం సుమారు రూ.100 కోట్లతో నిర్మించిన కళాక్షేత్రంలో, తెలంగాణ కోసం పాటలు పాడి,కళారూపాలను ప్రదర్శించి,తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక సాధనలో పాలుపంచుకున్నటువంటి కళాకారుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఈ రోజు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, ఎస్ఐఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్ మాట్లాడుతూ తెలంగాణ కళా రూపాలను జానపదాలు, ఒగ్గు కథ, బుర్రకథ లాంటి కళారూపాలతో మన తెలంగాణ



గొప్పతనాన్ని భారతదేశ వ్యాప్తంగా చాటిచెప్పి, పద్మశ్రీ అవార్డు సాధించినటువంటి కళాకారుల విగ్రహాలను కళాక్షేత్రం లోపల ఏర్పాటు చేయాలని, గత మూడు నెలలుగా ఉద్యమిస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కళలకు సంబంధంలేని కళాకారులు, వ్యక్తుల పేర్లు, అదేవిధంగా వారి విగ్రహాలను కళాక్షేత్రంలో ఏర్పాటు చేయడం అనేది తెలంగాణ కళలను, కళాకారులను అవమానించడమేనని విద్యార్థులు ఆరోపించారు. కఈ సందర్భంగా హనుమకొండలోని చౌరస్తా నుంచి బాలసముద్రం కళాక్షేత్రం వరకు జరిగిన భారీ ర్యాలీలో విద్యార్థులు వందలాదిగా పాల్గొని విజయవంతం చేశారు. కళాక్షేత్రం వద్ద పోలీసులకు విద్యార్థులకు మధ్య తోపులాట జరగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్టు చేసి సుబేదారి పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియా స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు దూడపాక నరేష్, తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్, అదేవిధంగా విద్యార్థి సంఘాల నాయకులు ఠాగూర్, మణితేజ, కుమార్, కలాం, నదీంపాషా, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ సీట్ సాధించిన బానోత్ రితిక్‌ను అభినందించిన ఎమ్మెల్యే నాగరాజు



**వరంగల్ వాయిస్, సుబేదారి :** వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నివాసంలో పర్వతగిరి మండల పరిధిలోని అన్నారం (దూపతండ)కు చెందిన బానోత్ రీతిక్ ఎంబీబీఎస్ సీట్ సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యే బానోత్ రితిక్ కు వైద్య విద్య పరికరాలను అందించి శాలువాతో సత్కరించి అభినందించటం జరిగింది. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించి ఎంబీబీఎస్ విద్య పూర్తి అయ్యే వరకు మీకు ఏ అవసరం ఉన్న నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఉన్నత స్థాయికి ఎదుగాలి ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి మండల అధ్యక్షుడు జటోత్ శ్రీనివాస్ నాయక్, దూపతండ బూత్ కన్వీనర్ మోహన్ నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు దరంసోతు తిరుపతి నాయక్, కాంగ్రెస్ నాయకులు పుల్ సింగ్ తో అతడి తల్లి క్రాంతతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మేరా యువ భారత్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా నెహ్రూ యువ కేంద్ర డీవైఓ చింతల అన్వేష్ ఆదేశాల మేరకు సోమవారం ట్రాఫిక్ వరంగల్ ఏసీపీ, వరంగల్, హనుమకొండ, కాజీపేట డివిజన్స్ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ల సహకారంతో ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వరంగల్, హనుమకొండ చౌరస్తా నుంచి వయా పోలీస్ హెడ్ క్వాటర్స్ నుంచి అదాలత్ జంక్షన్ వరకు మేరా యువ భారత్ వలంటరీ, యూత్, విద్యార్థిని విద్యార్థులచే ట్రాఫిక్ జంక్షన్ల దగ్గర వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ రూల్స్ ను వారికి తెలియపరుస్తూ వారి ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. ఈ ప్రోగ్రాంకు ముఖ్య అతిథులుగా డిస్టిక్ యూత్ ఆఫీసర్ చింతల అన్వేష్, నెహ్రూ యువ కేంద్ర ఏసీటీ దేవీలాల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కాకతీయ యూనివర్సిటీ ఈసం నారాయణ, ఎక్స్ఎన్ వై వి.వెల్దండ సురేష్, మేరా యువ భారత్ వలంటీర్లు ఈ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. ఈ వార్షికోత్సవాలు ఈనెల 27వ నుంచి 30వ తేదీ వరకు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రేపు నగరంలోని మార్కెట్ పరిసరాలను శుభ్రపరచడం, ఎల్లుండి ఆసుపత్రుల పరిసరాల్లో రోగులకు సహాయపడుట వంటి కార్యక్రమాలు జరగనున్నాయని మై భారత జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ తెలిపారు.

## రంగనాథ స్వామి దేవాలయాన్ని ఎండోమెంట్‌కు అప్పగించడం సరికాదు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కాశిబుగ్గ కాశీ విశ్వేశ్వర రంగనాథ స్వామి దేవాలయాన్ని ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకోవడాన్ని బీజేపీ తీవ్రంగా నిరసిస్తుంది. ఆలయాలకు మీ కార్యనిర్వహణాధికారిని వెంటనే తొలగించాలని వరంగల్ దేవాదాయ ధర్మదాయ శాఖ ఉప – కమిషనర్ ను విజ్ఞప్తి చేశారు. ఎంతో ఘనచరిత్ర ఉన్న ఈ ఆలయాన్ని భక్తితో శ్రద్ధలో పురప్రముఖులు, దాతల సహకారంతో నిర్వహించబడుతున్న ఆలయాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం దురహంకార దుశ్చర్య అని మండిపడ్డారు. ప్రభుత్వం నియమించిన కార్యనిర్వహణాధికారిని వెంటనే తొలగించి ప్రభుత్వం తన ఆధీనంలో నుంచి తిరిగి భక్తులకు అప్పగించాలని బీజేపీ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సముద్రాల పరమేశ్వర్, ఎరుకల రఘునాథ్ రెడ్డి, పైర్థి ఆనంద్, కోమాకుల నాగరాజు, కట్టర్ సతీష్, సిద్ధోజు శ్రీనివాస్, మెరుగు ప్రకాష్, అపురూప రజనీష్, ముచ్చర్ల ప్రభాకర్, చింతం రాజు, కందుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ధర్నా




**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పిలుపులో భాగంగా వరంగల్ జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో ఏకశిలా పార్క్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు రైతులు ప్రదర్శన నిర్వహించి ధర్నా చేశారు. కలెక్టర్ కు మెమోరాండం ఇచ్చారు .ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన పశ్య పద్మ, రాష్ట్ర కార్యదర్శి శంకరయ్య, రాష్ట్ర నాయకురాలు వజ్రాల అరుణ, వరంగల్ జిల్లా సంఘం అధ్యక్షుడు సాయిలు, వర్కింగ్ ప్రెసిడెంట్ పాష, జిల్లా నాయకులు శోభ, హసీనా, హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి రాజారాం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూవానకాలం, యాసంగికి, రైతు భరోసా రెండు లక్షలకు పైగా ఉన్న, రెండు లక్షల లోపు ఉన్న రుణాల మాఫీ వెంటనే చేయాలని, భూమి హక్కుల చట్టం త్వరితగతిన చేయాలని, సన్నరకం వడ్ల తో పాటు దొడ్డు రకం వడ్ల కు కూడా క్వింటాకు రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మన రాష్ట్రంలో పాలకులు స్వయంగా ఎన్నికల ప్రణాళికలో ప్రకటించి కూడా అమలు చేయకపోతే భవిష్యత్తులో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పాష మాట్లాడుతూ ఆలస్యమైనా సరే వానాకాలం, యాసంగి రెండు పంటలకు ఒకేసారి రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఉద్యోగస్తులకు ఐదు డీఏలు ప్రకటించాలి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలో ఉద్యోగస్తులకు, ఉపాధ్యాయులకు అందరికీ ఐదు డీఏలు ప్రకటించాలని తాహసీల్దారు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రికి మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల సతీష్ కుమార్, మండల అధ్యక్షులు ఆనంద్ మోహన్, మండల ప్రధాన కార్యదర్శి జూలపల్లి విజయ భాస్కర రావు, ఇతర ఉపాధ్యాయులు, మండల తాహసీల్ కార్యాలయంలో మెమొరండం అందజేశారు.

## కేయూ పోలీస్ స్టేషన్ తనిఖీ



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌ను సోమవారం సాయంత్రం హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి తనిఖీ చేశారు. కేయూసీ పోలీస్ స్టేషన్ లోని అన్ని రికార్డులను సీడీ ఫైల్స్ ను ఏసీపీ పరిశీలించారు. పెండింగ్ కేసుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరేడ్ లో ఏర్పాటు చేసిన కిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు . ఈ కార్యక్రమంలో కేయూ ఇన్ స్పెక్టర్ రవి కుమార్, ఎస్సైలు రవీందర్, ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ కమిటీ జిల్లా కన్వీనర్‌గా కడారి కుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ బండి అశోక్ అధ్యక్షతన ఆదివారం హనుమకొండ చౌరస్తా అమరావతి హోటల్ కాన్ఫరెన్స్ హాల్ లో సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ పోరాటం సమితి ముందుకు సాగాలని, వర్గీకరణపై వారు ప్రసంగించారు. అనంతరం ఎస్సీ వర్గీకరణ జిల్లా కమిటీలు వేశారు. కమిటీలో వరంగల్ జిల్లా కన్వీనర్ గా కరీమాబాద్ ప్రాంతానికి చెందిన కడారి కుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కోకన్వీనర్లుగా సాధు నర్సింగరావు, ఉసిల్ల దయాకర్, మా ఎన్నికను వమ్ము చేయకుండా కర్తవ్యానికి పనిచేస్తానని, నా ఎస్సీ ఉపకులాలకు న్యాయం చేస్తానని తెలిపారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన బండి అశోక్, దండు మోహన్, సాకీ సంతోష్, ప్రొఫెసర్ ఎర్రగడ్డ స్వామి, రౌతు రమేష్ లకు కడారి కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. కడారి కుమార్ కు నరిగే లక్ష్మణ్, బొమ్మల అంబేద్కర్, పలువురు అభినందనలు తెలిపారు.

## మండల విద్యాధికారికి ఉద్యోగ విరమణ సన్మానం




**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** మహాదేవపూర్ మండలానికి మండల విద్యాధికారిగా సేవలు అందించిన దడిగల శంకరయ్య ప్రధానోపాధ్యాయులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉమ్మాపూర్ ఈ నెల 31న ఉద్యోగ విరమణ పొందుతున్నతరుణంలో ఆయనకు పదవీ విరమణ సన్మాన వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఏసీజీ మండల రవీందర్ రెడ్డి, పురుషోత్తం, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల విద్యాధికారులు, పూర్వ ఉపాధ్యాయులు, స్నేహితులు, గ్రామస్తులు పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు బాలరాజు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# సాయి పల్లవి అంటే.. సాయి పల్లవే



### ఆమె నటనకు ఫిదా...

నేచురల్ బ్యూటీ సాయి పల్లవి, శివకార్తికేయన్ జంటగా విశ్వనటుడు కమల్ హాసన్ నిర్మిస్తున్న సినిమా అమరన్. ఈ సినిమా దీపావళి కానుకగా పలు భాషల్లో అక్టోబర్ 31న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలోనే చిత్ర యూనిట్ ప్రమోషన్స్‌లో జోరు పెంచింది. కానీ.. సాయి పల్లవి ప్రమోషన్స్ అటెండ్ కాకుండా చేసిన పని చూస్తే మీరు గ్రేట్ అనాల్సిందే.. ఇంతకీ సాయి పల్లవి ప్రమోషన్స్‌కి ఎందుకు అటెండ్ కావడం లేదు.. ఇంతకీ సాయి పల్లవి ఎం చేశారంటే.. అమరన్.. ఈ సినిమాని కాశ్మీర్ నేపథ్యంలో శివ్ అరూర్, రాహుల్ సింగ్ రాసిన ఆర్మీ మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత సంఘటనలతో రాసిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్ : ట్రూ స్టోరీస్ ఆఫ్ మోడరన్ మిలిటరీ' పుస్తకం ఆధారంగా యాక్షన్ ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సాయి పల్లవి తన సోషల్ మీడియా ఖాతాలో ఆసక్తికర సందేశాన్ని పోస్ట్ చేశారు. ''అమరన్ కోసం ప్రమోషన్‌లను ప్రారంభించే ముందు నేను నేషనల్ వార్ మెమోరియల్‌ని సందర్శించాలనుకున్నాను. ఈ పవిత్రమైన ఆలయంలో, మన కోసం తమ ప్రాణాలను అర్పించిన ప్రతి బ్రేవ్‌హార్ట్ జ్ఞాపకార్థం వేలకొద్దీ 'ఇటుక లాంటి పలకలు' ఉన్నాయి. మేజర్ ముకుంద్ వరదరాజన్, సిపాయి విక్రమ్ సింగ్ లకు నివాళ్లు తెలుపుతున్నపుడు నా ఒళ్ళు పులకరించి పోయింది'' అంటూ పోస్ట్ చేశారు. దీంతో అందరు సాయి పల్లవి గెస్చర్ కి హర్షం వ్యక్తం చేస్తున్నారు.



### సాయి పల్లవికి నేను పెద్ద అభిమానిని

దిగ్గజ దర్శకుడు మణిరత్నం తమిళ దిగ్గజ దర్శకుడు మణిరత్నం నటి సాయి పల్లవిని ప్రశంసలతో ముంచెత్తాడు. సాయి పల్లవికి నేను నేను పెద్ద అభిమానిని. తను అంటే చాలా ఇష్టమని. సమయం దొరికినప్పుడు కచ్చితంగా ఆమెతో సినిమా చేస్తానని మణిరత్నం వెల్లడిరచాడు. కోలీవుడ్ హీరో శివ కార్తికేయన్, నటి సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం అమరన్. ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్ అనే పుస్తకంలోని మేజర్ వరదరాజన్ కథ ఆధారంగా ఈ సినిమా రానుండగా.. ఇందులో శివ కార్తికేయన్ ఆర్మీ అధికారి మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా దీపావళి కానుకగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మూవీ ప్రీ రిలీజ్ వేడుకను గ్రాండ్‌గా జరుపగా ఈ వేడుకకు ముఖ్య అతిథిగా దర్శకుడు మణిరత్నం వచ్చి మాట్లాడాడు. ఈ క్రమంలోనే సాయి పల్లవి గురించి మాట్లాడుతూ.. సాయి పల్లవికి నేను నేను పెద్ద అభిమానిని. తను అంటే చాలా ఇష్టమని. సమయం దొరికినప్పుడు కచ్చితంగా ఆమెతో సినిమా చేస్తానని మణిరత్నం వెల్లడిరచాడు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.`

# వాటి కోసం ఎంత సమయమైనా ఓకే

### పాస్టిక్ సర్జరీ పై నయనతార మండిపాటు

హీరోయిన్లు తాము చేసే సినిమాల గురించే కాకుండా ఇతర విషయాలపైనా వార్తల్లో నిలుస్తుంటారు. అందులో వారి ప్రమేయం ఉండొచ్చు ఉండకపోవచ్చు. ఒక్కోసారి ఏ సంబంధం లేకుండానే వార్తలకెక్కుతారు. తాజాగా అలాంటి వార్తలపై నయనతార మండిపడ్డారు. తాను ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నట్లు గతంలో వచ్చిన వార్తలను ఆమె ఖండిరచారు. దేవుడు ఇచ్చిన తన ముఖాన్ని మార్చుకోవాలని ఎప్పుడూ ప్రయత్నించలేదని, ఆ ఆలోచన కూడా రాలేదని తెగేసి చెప్పారు. నయన్ ఇండస్ట్రీ లో అడుగుపెట్టిన కొన్నాళ్ల తర్వాత పలు చిత్రాల్లో ఆమె ముఖం తొలి సినిమాలో కంటే సన్నగా కనిపించింది. దీంతో ఆమె ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నారనే రూమర్స్ మొదలయ్యాయి. తాజాగా నయనతార వాటికి ఫుల్‌స్టాప్ పెట్టారు. ఆదివారం ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె దీనిపై మాట్లాడారు. ''నా కనుబొమ్మలు అంటే నాకు చాలా ఇష్టం. వాటి ఆకారం ఎప్పుడూ మారుస్తూ ఉంటాను. ప్రతి రెడ్ కార్పెట్ ఈవెంట్లకు ముందు వాటిని మార్చుతుంటాను. వాటి కోసం ఎంతో సమయాన్ని కేటాయిస్తాను. కనుబొమ్మల ఆకారం మారినప్పుడల్లా ముఖంలో మార్పు కనిపిస్తుంది. బహుశా అందుకే నా ముఖంలో మార్పులు వచ్చాయని ప్రజలు అనుకొని ఉంటారు. వాళ్లు అనుకున్నది నిజం కాదు.. అలాగే డైటింగ్ వల్ల కూడా నా ముఖంలో మార్పులు రావచ్చు. ఒక్కోసారి బుగ్గలు వచ్చినట్లు కనిపిస్తుంటాయి. ఇంకోసారి అవి లోపలికి వెళ్లినట్లు అనిపిస్తుంటుంది. కావాలంటే మీరు నన్ను గిచ్చి చూడొచ్చు.. నా శరీరంలో ఎక్కడా ప్లాస్టిక్ ఉండదు'' అని నయనతార అన్నారు. ప్రస్తుతం ఆమె కోలీవుడ్‌తోపాటు బాలీవుడ్‌లోనూ బిజీ అయ్యారు. గతేడాది 3 సినిమాలతో అలరించిన నయన్ ప్రస్తుతం ఐదు సినిమాలతో బిజీగా ఉన్నారు.







# దళపతి పొలిటికల్ ఎంట్రీపై స్పందించిన పవన్

కోలీవుడ్ స్టార్ దళపతి విజయ్ పొలిటికల్ ఎంట్రీపై నటుడు, జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రియాక్టయ్యారు. ఆయనతో పాటు విలక్షణ నటుడు ప్రకాష్ రాజ్ కూడా తనదైన స్టైల్‌లో రెస్పాండ్ అయ్యారు. బీజేపీ, డీఎంకే సిద్ధాంతాలకు వ్యతిరేఖంగా ఏర్పాటు చేసిన తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేతకు పవన్, ప్రకాష్ ఎం చెప్పారంటే.. ''నాకు రాజకీయ అనుభవం లేకపోవచ్చు. కానీ, నేను పొలిటిక్స్ విషయంలో భయపడడం లేదు'' అంటూ విజయ్ ఆదివారం తన పార్టీ తొలి మహానాడులో మాట్లాడారు. ఈ నేపథ్యంలోనే దేశ నలుమూలల నుండి సినీ, రాజకీయ ప్రముఖులు విజయ్‌కి అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలోనే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన సోషల్ మీడియా అకౌంట్ ద్వారా అభినందనలు తెలిపారు. పవన్ తన పోస్ట్‌లో '' సిద్ధులు, సాధువులకు నిలయమైన తమిళనాడులో తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన విజయ్ కి నా హృదయపూర్వక అభినందనలు'' అంటూ పోస్ట్ చేశారు.

# ఖలేజా గురించి మాట్లాడితే గొడవే

మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం లక్కీ భాస్కర్. గత ఏడాది 'సార్' సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న వెంకీ అట్లూరి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ సినిమా దీపావళి కానుకగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే మూవీ నుంచి ట్రైలర్‌తో పాటు పాటలు విడుదల చేయగా.. ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకను హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించారు మేకర్స్. ఇక ఈ ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథులుగా రౌడి హీరో విజయ్ దేవరకొండతో పాటు మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ వచ్చి సందడి చేశారు. అయితే ఈ వేడుకలో విజయ్ మాట్లాడుతూ.. తనకు సితార ఎంటర్‌టైనమెంట్స్‌తో మంచి అనుభందం ఉందని విజయ్ తెలిపాడు. పెళ్లి చూపులు మూవీ విజయం సాధించిన తర్వాత నా ఫస్ట్ చెక్ సితార ఎంటర్‌టైనమెంట్స్ నుంచి అందుకున్నాను. త్రివిక్రమ్ గారు నన్ను ఆఫీస్‌లో కుర్చోబెట్టి నా ఫస్ట్ చెక్ ఇప్పించారు. ఇది జరిగి 7 ఏండ్లు అవుతుంది. సితార అప్పుడు చెక్ ఇస్తే.. ఇన్ని సంవత్సరాలు పట్టింది సినిమా చేయడానికి. ఇప్పుడు మేం కలిసి వీడీ12 చేస్తున్నాం. త్రివిక్రమ్ సర్‌ని ఫస్ట్ టైం కలవడం నా లైఫ్‌లో మర్చిపోలేని క్షణం. నా పర్సనల్ ఫేవరెట్ చిత్రాలు అతడు, ఖలేజా. ఖలేజా సినిమా అయితే ఎవడైనా నచ్చలేదు అంటే నేను వాడితో గొడవ పడే వాడిని అంటూ విజయ్ చెప్పుకొచ్చాడు. అలాంటి మనిషి నాకు చెక్ ఇచ్చి నువ్వు స్టార్ అవుతావు అంటూ చెప్పాడు. ఎవరు సినిమాలు చూస్తూ పెరిగామో ఆ వ్యక్తి మనల్ని స్టార్ట్ అవుతారు అని చెప్పినప్పుడు చాలా ఆనందం వేసింది అంటూ విజయ్ చెప్పుకోచ్చాడు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.



WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

సోమవారం, అక్టోబర్ 28, 2024

# నరకాసుర వధను తిలకించండి

- తర్వాతే నోములు, పూజలు చేసుకోండి
- అప్పుడే పుణ్యఫలం లభిస్తుంది
- వేదపండితులు అదే చెబుతున్నారు
- నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి
- భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నరకాసుర వధను కన్నులారా చూసిన తర్వాతే దీపావళి నోములు, పూజలు నిర్వహించుకుంటే పుణ్యఫలం లభిస్తుందని వేద పండితులు చెబుతున్నారని నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి తెలిపారు. గత 22 సంవత్సరాలుగా నరకాసుర వధ కార్యక్రమాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఈనెల 30వ తేదీ బుధవారం సాయంత్రం 8 గంటలకు ఉర్సు గుట్ట కుడా మైదాన ప్రాంగణంలో నరకాసుర వధకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కరీమాబాద్ లోని బీరన్న దేవాలయంలో సోమవారం నరకాసుర వధ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. శాస్త్ర ప్రకారం 58 అడుగుల ఎత్తైన నరకాసురుడి ప్రతిమను ఏర్పాటు చేసి అత్యంత శక్తివంతమైన బాణాసంచాతో దహనం చేసేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా 5గంటలకు ఉర్సు ప్రతాప్ నగర్ నుంచి శ్రీ కృష్ణ సత్యభామ వేషదారణలతో స్థానిక కళాకారులు చెక్క భజనలతో మేళతాళాలతో పురవీధుల గుండా రంథంతో ఊరేగింపు నిర్వహిస్తున్నామన్నారు.

### 22 సంవత్సరాలుగా..

రెండు తెలుగు రాష్ట్రాల్లోనే ఎక్కడా లేని విధంగా ఉర్సు గుట్ట కుడా మైదాన ప్రాంగణంలో గత 22 సంవత్సరాలుగా నరకాసుర వధ కార్యక్రమాన్నినిర్వహిస్తున్నట్లు మరుపల్ల రవి తెలిపారు. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి ప్రతి ఏడు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు కొన్ని దుష్ట శక్తులు ప్రయత్నించినా భగవంతుని కృపతో ఉత్సవాలను దిగ్విజయం చేస్తున్నామని వెల్లడించారు. దీనికి స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. బల్దియా ఆధ్వర్యంలో ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయన్నారు. బందోబస్తు చర్యల్లో భాగాంగా పోలీసులు కుడా మైదానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారన్నారు.

### దాతల సహకారం అవసరం..

నరకాసుర వధను తిలకించేందుకు వస్తున్న వారి సంఖ్య ఏటేటా పెరుగుతోందని సరకాసుర వధ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి శతపతి శ్యామల రావు తెలిపారు. నాటి చరిత్ర, ఆధ్యాత్మికతను నేటి తరానికి తెలియజేయాలన్న సంకల్పంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అయితే ఇది ఖర్చుతో కూడుకున్నదన్నారు. దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తే ఈ ఉత్సవాలను మరింత వైభవోపేతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సరకాసుర వధ ఉత్సవ కమిటీ కోశాధికారి కనుకుంట్ల రవి, సహాయ కార్యదర్శి ఆవునూరి రాంమూర్తి, ప్రచార కార్యదర్శి మరుపల్ల గౌతమ్, ఆర్గనైజర్లు దూడ కొమురెల్లి, కుండె రాజు, గౌడ రాము, కార్యవర్గ సభ్యులు అన్న కుమార స్వామి, మరుపల్ల శివ, తౌటం సర్సింహ, కొమ్ము రాజు, దాసరి రాజు పాల్గొన్నారు.



## వాగ్దేవిలో ఇంటర్న్‌షిప్ కమ్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

### పాల్గొన్న 550 మంది విద్యార్థులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని బొల్లికుంట వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో బెంగళూరులోని గ్లోబల్ క్వెస్ట్ టెక్నాలజీస్, ఇండస్ట్రీ ఇన్‌స్టిట్యూట్ ఇంటరాక్షన్ సెల్ ఆధ్వర్యంలో సోమవారం ఇంటర్న్‌షిప్ కమ్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. డాక్టర్ పునీత్ రాజ్‌కుమార్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ చొరవతో ఈ కార్యక్రమం జరిగింది. జీఆర్ గ్లోబల్ క్వెస్ట్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్, వ్యవస్థాపకుడు నరేంద్ర రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వాగ్దేవి గ్రూప్ కాలేజీల కోసం రూపొందించిన ఉచిత సీఎస్సార్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా విద్యార్థులను అవసరమైన నైపుణ్యాలతో సన్నద్ధం చేయడం డ్రైవ్ యొక్క లక్ష్యాన్ని నొక్కి చెప్పారు. ఈ చొరవ విద్యార్థులకు ధృవీకరణతో కూడిన కాంప్లిమెంటరీ ఇంటర్న్‌షిప్‌ను అందిస్తుందని, పరిశ్రమ ప్రమాణాలకు అనుగుణంగా నిజ-సమయ ప్రాజెక్టలలో పని చేయడానికి వారిని అనుమతిస్తుందన్నారు. ఎంపికైన విద్యార్థులు బెంగళూరులోని గ్లోబల్ క్వెస్ట్ ప్రధాన కార్యాలయంలో 90 రోజుల ఆఫ్‌లైన్ ఇంటర్న్‌షిప్‌ను చేపడతారన్నారు. ఈ డ్రైవ్‌లో ఫ్యాకల్టీ కోఆర్డినేటర్, స్టూడెంట్ కోఆర్డినేటర్ ఎం.యశ్వంత్‌తో పాటు వివిధ విభాగాలకు చెందిన 550 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## వారు సమాజానికి అమూల్యమైన సంపద



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వయో వృద్ధులు సమాజానికి అమూల్యమైన సంపదని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అన్నారు. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన వయో వృద్ధుల సంక్షేమ చట్టం 2007, నిబంధనలు 2011పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వయో వృద్ధుల అభ్యున్నతికి, వారి సమస్యల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. జిల్లాలో వయో వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం సమర్ధ అమలుకు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. 2007లో ప్రభుత్వం వయోవృద్ధుల సంరక్షణకు చట్టం అమల్లోకి తీసుకువచ్చిందని కలెక్టర్ తెలిపారు. దీనిపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సీనియర్ సిటిజన్స్ హక్కులపై అవగాహన కల్గి ఉండేలా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ సందర్భంగా హెల్ప్ ఏజ్ ఇండియా రాష్ట్ర సమన్వయకర్త శ్యామ్ చట్టం, భిన్నమైన వృద్ధుల సమస్యలను సెక్షన్స్ ప్రకారం అమలుపై పూర్తి అవగాహన కల్పించి, సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ కృష్ణవేణి, జడ్పీ సీఈఓ రాంరెడ్డి, సంబంధిత విభాగాల జిల్లా అధికారులు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజమణి, సిబ్బంది, జిల్లా సీనియర్ సిటిజన్స్ కమిటీ మెంబెర్స్, జిల్లాలోని పలు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## పెద్దాపూర్ బస్సు సర్వీస్

### రైతులకు సౌకర్యంగా ఉంటుందన్న ఎమ్మెల్యే సత్యనారాయణ రావు

**వరంగల్ వాయిస్, శాయంపేట :** పరకాల నుంచి వరంగల్ కు పెద్దాపూర్ మీదుగా నడిచే ఆర్టీసీ బస్సు రైతులకు, ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శాయంపేట బస్టాండ్ సెంటర్ లో పరకాల డిపో మేనేజర్, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే జెండా ఊపి బస్సు సర్వీస్ ను ప్రారంభించారు. అనంతరం బస్సులో టిక్కెట్టు కొనుగోలు చేసి కొద్దిదూరం ప్రయాణించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎనిమిదేళ్ళ క్రితం పరకాల నుంచి శాయంపేట, ఆత్మకూరు, అక్కంపేట, పెద్దాపూర్, మొగిలిచర్ల, ఏనుమాముల మార్కెట్ మీదుగా వరంగల్ కు వెళ్ళే బస్సు రద్దు అయిందన్నారు. వివిధ పనుల నిమిత్తం శాయంపేట మండల ప్రజలు ఏనుమాముల మార్కెట్, వరంగల్ కు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం మండల ప్రజల సమస్యలు పట్టించుకోలేదన్నారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి పెద్దాపూర్ బస్సును ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారపల్లి రవీందర్, మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాష్, మాజీ జడ్పీటీసీ చల్లా చక్రపాణి, నాయకులు దుబాసి కృష్ణమూర్తి, చిందం రవి, సుధాకర్ రావు, భాస్కర్, రమేష్, మార్కండేయ, కట్టయ్య, రాజేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలను సంరక్షించాలి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ దశాబ్ది సంపద వనంలో పెంచుతున్న మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. సోమవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ శివారులోని తెలంగాణ దశాబ్ది సంపద వనాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వన కేంద్రంలో ఎన్ని మొక్కలు పెంచుతున్నారనే వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మొక్కలకు అందిస్తున్న నీటి సౌకర్యంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ మొక్కలకు సరిపోను నీటిని అందించి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ నాగ పద్మజ, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డ్ కుటుంబానికి.. రూ.30 లక్షల ప్రమాద బీమా అందజేత

**వరంగల్ వాయిస్, వరంగల్ :** తొలిసారిగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదంలో మరణించిన హోంగార్డ్ వి.సుధాకర్ కుటుంబానికి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా చేతుల మీదుగా రూ.30లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. సుధాకర్ మామూనూర్ నాల్గో పటాలంలో విధులు నిర్వహిస్తుండగా గత ఆగస్టు 13వ తేదీన మామూనూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. సుధాకర్ యాక్సిస్ బ్యాంక్ జీతానికి సంబంధించిన ఖాతాదారుడు కావడంతో యాక్సిస్ యాజమాన్యం మరణించిన హోంగార్డ్ కుటుంబానికి రూ.30లక్షల బీమా చెక్కును మరణించిన హోంగార్డ్ సతీమణి కొమలకు వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మరణించిన హోంగార్డ్ కుటుంబ సభ్యుల స్థితిగతులను సీపీ అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌పరంగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమములో హోంగార్డ్స్ ఆర్ఐ చంద్ర శేఖర్, యాక్సిస్ బ్యాంక్ వరంగల్ ఏరియా బాధ్యుడు కృష్ణ హోసూర్, బ్యాంక్ సిబ్బంది వంశీ, శ్రీధర్ పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com